
సాక్షి బాపట్ల

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు మెడికల్ : ఏపీ నర్సింగ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 822.10 అడుగుల వద్ద ఉంది.


వారంలో మూడు రోజులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ వైద్య విభాగంలో వారంలో మూడు రోజులు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు.

న్యూస్‌రీల్

గుంటూరు పార్లమెంట్ రీజినల్ కో-ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డికి అదనంగా గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం బాధ్యతలను అప్పజెప్పారు. ఈమేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇకపై గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి వ్యవహరిస్తారు.

జెడ్పీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన వసంతరాయుడు



గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవోగా ఎన్వీబీఎస్ వసంతరాయుడు బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం బదిలీ చేసింది. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జెడ్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించిన జె.మోహన్‌రావు డిప్యూటీ సీఈవోగా కొనసాగనున్నారు.

తుది క్లెయిమ్‌లు పరిశీలించండి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి తుది జాబితాను ప్రకటించిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తుదిజాబితా తర్వాత వచ్చే క్లెయిమ్స్‌ను బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించాలన్నారు. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోవాలని పేర్కొన్నారు. బీఎల్‌ఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఓటరు నమోదు ప్రక్రియలో అవకతవలకు పాల్పడినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జేసీ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, స్పెసల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కొలువులకు గ్రీన్ సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో 397 పోస్టుల భర్తీకి అవకాశం
- డీఎస్సీ-2024కు కేబినెట్ ఆమోదంతో నిరుద్యోగుల్లో ఆశలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ-2024 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో 397 పోస్టులు భర్తీ కానున్నట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. వీటిలో 250 ఎస్జీటీ, 147 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. కేబినెట్ ఆమోదంతో డీఎస్సీ-2024 నోటిఫికేషన్ విడుదల కానుంది. కాగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోస్టుల సంఖ్యపై నోటిఫికేషన్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో ఖాళీల ఆధారంగా విద్యాశాఖ పంపిన పోస్టుల సంఖ్యకు అదనంగా మరిన్ని పోస్టులు కలిసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో గత నాలుగేళ్లలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు పెరిగే అవకాశాలున్నాయి. డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యతో పాటు దరఖాస్తు, పరీక్షా విధానం తదితర అంశాలపై స్పష్టత రానుంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయించడంతో నిరుద్యోగ ఉద్యోగార్థుల్లో ఉత్సాహం నెలకొంది.

సామాజిక రణభేరి

- సామాజిక సాధికార బస్సుయాత్రకు వెల్లువెత్తిన ప్రజలు
- ఒకటిన్నర కి.మీ.నడిచేందుకు గంటన్నర సమయం
- చంద్రబాబు బీసీ అభ్యర్థిని తొలగించి తన కొడుక్కి టికెట్ ఇచ్చుకుంటే, బీసీ వర్గాలకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరిలో సాధికారతను నలుదిశలా చాటిన సామాజిక బస్సు యాత్ర



ప్రసంగిస్తున్న గంజి చిరంజీవి, వేదికపై మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ హనుమంతరావు, జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కాండ్రు కమల తదితరులు

తాడేపల్లిరూరల్: నియోజకవర్గంలో అన్ని దారులు మంగళగిరి వైపే సాగాయి. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన సామాజిక నినాదానికి మంగళగిరి ప్రజలు జైకొట్టారు. మంగళగిరి సీటును ఏకంగా బీసీలకు కేటాయించడంతో ఆయా వర్గాల్లో ఉత్సాహం ఉరకలేసింది. బుధవారం మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్త బస్టాండ్ నుంచి మిద్దె సెంటర్ వరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేసేందుకు ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. బస్సుయాత్ర ప్రారంభమయ్యే సమయంలో అక్కడకు చేరుకున్న ప్రజలు కోలాహలంగా డ్యాన్సలు చేస్తూ జయహో సామాజిక సాధికార యాత్ర అంటూ నినాదాలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవ్వాలంటూ నినాదాలు చేశారు. డీజే సౌండ్‌లు, బాణసంచా మోతతో మంగళగిరి మార్మోగింది. పాదయాత్ర ప్రారంభమయ్యే సమయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు జింకా విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పట్టణంలో బుల్లెట్లతో ర్యాలీ నిర్వహించారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర నాయకుల ఫొటోలతో కూడిన ప్ల కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఒకటిన్నర కిలోమీటర్లు నడవడానికి గంటన్నర సమయం పట్టిందంటే బస్సు యాత్రను ఏ విధంగా విజయవంతం చేశారో అర్థం అవుతుంది.

బలహీనవర్గాలకు సీటు ఇచ్చిన ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమసమాజ నిర్మాణం కోసం ఎంతో కృషి చేస్తున్నారని, దానిలో భాగంగా మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తిని నిర్ణయించారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీసీ అభ్యర్థినైన తనను తొలగించిన చంద్రబాబు తన కొడుకు లోకేష్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. మంగళగిరి ప్రజలు దానిని తిరస్కరించి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గానికి చెందిన తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారన్నారు. దీనిని బట్టి మంగళగిరి ప్రజలు సమసమాజ నిర్మాణం ఎవరు చేస్తున్నారు? పెత్తందారీ విధానాన్ని ఎవరు అమలు చేస్తున్నారనే విషయాలను గమనించుకోవాలని అన్నారు. మంగళగిరిలో పేద ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారని, గతంలో ఎన్నడూ చేయని విధంగా అభివృద్ధి మంగళగిరిలో జరిగిందన్నారు.

సాధికార యాత్ర సాగింది ఇలా..

సామాజిక సాధికార యాత్ర సందర్భంగా మంగళగిరి ఉదయం నుంచి కోలాహలంగా మారింది. గౌతమ్ బుద్ధ రోడ్‌లోని కొత్త బస్టాండ్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాల వద్దకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు చేరుకున్నారు. సాయంత్రం 4.45 నిమిషాలకు ప్రారంభమైన ర్యాలీ మిద్దె సెంటర్‌కు 5.10 నిమిషాలకు చేరుకుంది. సాయంత్రం 5.15కు బహిరంగ సభ ప్రారంభమై 7.10కి ముగిసింది.



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాండ్రు కమల, మురుగుడు, ఎంపీ విజయసాయిరెడ్డి

గుంటూరులో ఐటీ సోదాలు

- లలితా స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు
- సాయంత్రం వరకు కొనసాగిన అధికారుల పరిశీలన
- వేర్వేరు చోట్ల కీలక పత్రాలు స్వాధీనం



కొత్తపేటలోని లలితా హాస్పిటల్

పాత గుంటూరు: గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన నాలుగు బ్రాంచీలతో పాటు నివాసాలు, నర్సింగ్ హాస్టళ్లలో ఢిల్లీకి చెందిన 30మందికి పైగా ప్రత్యేక ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్ ప్రాంతానికి ఉదయం 9 గంటల సమయానికి చేరుకున్నారు. నరాసరి హాస్పిటల్ లోపలికి వెళ్లి సుదీర్ఘంగా సోదాలు నిర్వహించి విలువైన పత్రాలు, ఆస్తుల డాక్యుమెంట్లను పరిశీలించారు. తనిఖీలు కొనసాగినంత సేపు భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది హాస్పిటల్‌లోకి వెళ్లే రోగులను సైతం లోపలికి వెళ్లేందుకు నిరాకరించారు. లోపల జరిగే విషయాలు బయటికి రాకుండా స్థానిక అధికారుల ఫోన్‌లన్నీ స్విచ్ ఆఫ్ చేయించారు. గుంటూరులో ఓ థియేటర్, మరికొన్ని విలువైన ఆస్తులు కొనుగోళ్లతో పాటు తక్కెళ్లపాడు హైవేలో భారీ కట్టడాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో ఈ సోదాలు జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. స్థానిక ఐటీ అధికారులు కూడా పాల్గొన్నారు. రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. ప్రముఖ వైద్యశాలపై ఒక్కసారిగా 30 ప్రత్యేక బృందాలు దాడులు చేయడంతో వైద్యవర్గాల్లో ఆందోళన నెలకొంది.

బలహీన వర్గాలకు పెద్దపీట



నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా అనిల్ కుమార్ యాదవ్

- ఐదో జాబితాలో ప్రకటించిన వైఎస్సార్ సీపీ
- సోషల్ ఇంజినీరింగ్‌లో భాగంగా బీసీలకు కేటాయించిన సీఎం వైఎస్ జగన్
- నెల్లూరు టౌన్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్
- అనిల్ యాదవ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు

సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట లోక్‌సభ పార్టీ సమన్వయకర్తగా పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ ప్రకటించింది. 2024 ఎన్నికల్లో అన్ని సీట్లలో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రకటించిన ఐదో జాబితాలో అనిల్ కుమార్ యాదవ్‌కు చోటు లభించింది. దేశంలో మరెక్కడా లేనివిధంగా రాజకీయాల్లో బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా నరసరావుపేట లోకసభ స్థానాన్ని ఈ దఫా బీసీలకు కేటాయించాలని సీఎం నిర్ణయించారు. దీంతో యాదవ వర్గానికి చెందిన అనిల్ కుమార్‌కు అవకాశం కల్పించారు. ఈ నిర్ణయంపై బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయ చైతన్యం కలిగిన కీలకమైన పల్నాడు లాంటి ప్రాంతంలో బలహీనవర్గాలకు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఇప్పటికే బలంగా ఉన్న నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో కొత్తగా ఇన్‌చార్జిగా అనిల్ యాదవ్ పేరు ప్రకటనతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నెలకొంది. నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఈ దఫా బీసీలకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించడంతో ప్రస్తుతం ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.



రాజుపాలెం బస్టాండ్ సెంటర్‌లో టపాసులు కాలుస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు...

రాజుపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా పోలుబోయిన అనీల్‌కుమార్‌యాదవ్‌ను పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడంతో మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. కార్యకర్తలు, నాయకులు భారీ స్థాయిలో టపాసులు పేల్చి కేరింతలు కొట్టారు.

మంత్రిగా పనిచేసిన అనుభవం...

నరసరావుపేట లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రకటించిన పి.అనిల్ కుమార్ యాదవ్ నెల్లూరు టౌన్ అసెంబ్లీ స్థానం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి వరుసగా విజయం సాధించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తొలి కేబినెట్‌లో అనిల్ యాదవ్ జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. అనిల్ కుమార్ యాదవ్ చెన్నైలోని ఓ ప్రముఖ కళాశాలలో బీడీఎస్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున నెల్లూరు కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా చేశారు. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసిన అనిల్‌యాదవ్ కేవలం 90 ఓట్లతో ఓటమి చెందారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా
- 'జగనన్నకు చెబుదాం'కు 34 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అద్దంకి: ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపేవిధంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. సంతమాగులూరు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వకర్త పానెం చిన హనిమిరెడ్డి హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన సమస్యలకు అక్కడికక్కడే కలెక్టర్ పరిష్కారం చూపారు. మిగిలిన అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న పోర్టల్‌లో వచ్చిన సమస్యలకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వాటిని గడువు లోగా పరిష్కరించాలన్నారు. మంగళవారం వరకు జేకేసీ పోర్టల్‌లో జిల్లావ్యాప్తంగా 378 అర్జీలు రాగా వాటిలో రెండు మినహా మిగిలిన అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 7 అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై ఆరా తీశారు. అర్జీలు రాగానే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించేలా చిత్తశుద్ధి చూపాలన్నారు. సంతమాగులూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వివిధ శాఖలకు సంబధించి 34 అర్జీలు అందాయి. వాటిలో నెహ్రూనగర్‌లో పంట పొలాలకు పట్టా ఇవ్వాలని కోరుతూ రైతులు అర్జీ అందజేశారు. చీరాల ఆర్డీఓ పి.సరోజిని, రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, జిల్లా అధికారులు, మండలంలోని వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

నిందితులు కోర్టుకు తరలింపు

మార్టూరులో పోలీసు పికెట్

మార్టూరు: గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీల నిమిత్తం మంగళవారం మార్టూరు వచ్చిన మైనింగ్, విజిలెన్స్ అధికారులను అడ్డుకున్న కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులలో ఆరుగురిని బుధవారం ఉదయం 6 గంటల సమయంలో ఎస్ఐ శ్రీనివాసరావు బందోబస్తు మధ్య అద్దంకి కోర్టుకు తరలించారు. కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న చల్లగుండ్ల కృష్ణ, ఏ8 నిందితుడైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు మినహా మిగిలిన ఆరుగురు నిందితులను కోర్టుకు తరలించారు. నిందితులలో ఏ1 నిందితుడైన కామేపల్లి జనార్దన్, ఏ3 నడింపల్లి హనుమాన్ ప్రసాదు, ఏ4 షేక్ అబ్దుల్ రజాక్, ఏ5 మిన్నెకంటి రవి, ఏ6 అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు, ఏ7 ప్రత్తిపాటి సురేష్‌లను కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా బాపట్ల డీఎస్పీ శ్రీనివాసులు పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ అరెస్టుల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఇసుక దరిశిలోని ఏలూరి క్యాంపు కార్యాలయం సమీపంలో, మార్టూరు సెంటరులో నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 150 మంది సిబ్బందితో పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నరసింహారావు

ఇద్దరు డైరెక్టర్ల ఆస్తుల జప్తు

- వేటపాలెం కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో నగదు గోల్‌మాల్ కేసు
- దర్యాప్తులో పురోగతి

వేటపాలెం: వేటపాలెం కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డిపాజిట్ల గోల్‌మాల్ కేసులో మరో ఇద్దరు మాజీ డైరెక్టర్ల ఆస్తులు జప్తు చేశారు. ఈ మేరకు సొసైటీ ప్రత్యేక అధికారి సుధాకర్ గ్రామంలో బుధవారం దండోరా వేయించారు. 2021లో కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దాదాపు 1200 మంది సన్న, చిన్నకారు రైతులు, చిరు వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగులు తమ ఖాతాల్లో డిపాజిట్‌ల రూపంలో దాచుకున్న రూ. 23 కోట్లు నగదును సొసైటీ సెక్రటరీ శ్రీరాం శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ వలివేటి నాగేశ్వరరావు, తొమ్మిది మంది డైరెక్టర్స్ స్వాహా చేశారు. అప్పట్లో వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. దీనిపై విచారణాధికారిని నియమించారు. అప్పట్లో డిపాజిట్ల గోల్‌మాల్ కేసుతో సంబంధం ఉన్న సెక్రటరీ, అధ్యక్షుడు, తొమ్మిది మంది డైరెక్టర్స్ ఆస్తులు జప్తు చేశారు. అనంతరం కేసుతో సంబంధం ఉన్నవారంతా కండిషన్ బెయిల్‌పై బయటికి వచ్చారు. నాలుగు నెలల క్రితం ఈ కేసుతో మరో నలుగురు మాజీ డైరెక్టర్లకు సంబంధం ఉన్నట్లు సొసైటీ విచారణ అధికారి ధ్రువీకరించారు. ఈ మేరకు ఆ నలుగురు డైరెక్టర్లను అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై బయటికి వచ్చారు. ఈ క్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు కేసుతో సంబంధం ఉన్న మాజీ డైరెక్టర్లు చుండూరి వెంకట రమణారావుకి సంబంధించిన నాలుగు ఆస్తులు, చుండూరి శ్రీప్రకాష్‌కు సంబంధించిన ఒక ఆస్తిని జప్తు చేసినట్లు సొసైటీ ప్రత్యేక అధికారి తెలిపారు. జప్తు చేసిన ఆస్తులకు సంబంధించి ఎటువంటి ఆర్థిక లావాదేవీలు చేయకూడదని తెలిపారు.



దండోరా వేయిస్తున్న సొసైటీ ప్రత్యేక అధికారి

బాలల శ్రేయస్సుకు సమష్టి కృషి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి

నరసరావుపేట: బాలల హక్కుల పరిరక్షణ, వారి శ్రేయస్సును కాంక్షించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రణాళికాయుతంగా అడుగులు వేయాల్సిందేనని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, మోడల్ స్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు, బీసీ, ట్రైబల్, వెల్ఫేర్, వసతి గృహాల వార్డెన్లు, విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ, పోలీస్ శాఖాధికారులు, ఆర్టీసీ, దేవదాయశాఖ, మండల విద్యాశాఖల అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడతారో అక్కడ ప్రత్యక్షంగా, పరోక్షంగా తనదైన శైలిలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అడుగులు వేస్తుందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిని గమనిస్తూ ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తామని హెచ్చరించారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: సాధారణ ఎన్నికలలో నామినేషన్ల స్వీకరణ వరకు నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో సమావేశం జరిగింది. హోం ఓటింగ్ వంటి నూతన విధానం అమలులోకి రానుందని కలెక్టర్ తెలిపారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటే అలాంటివారు నూతన విధానం ద్వారా ఇంటివద్దనే తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. డిసెంబర్ 9వ తేదీనుంచి ఇప్పటివరకు మొత్తం 39,412 దరఖాస్తులు వచ్చాయన్నారు. నూతన ఓటర్ల దరఖాస్తులతో పాటు చిరునామాల మార్పులు, చేర్పులు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 5,083 దరఖాస్తులు తిరస్కరించగా, 8,818 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్నికల కోసం ఈవీఎంల పంపిణీ, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఎంపిక చేసి రాష్ట్ర ఎన్నికల అధికారులకు నివేదిక పంపామన్నారు. డీఆర్‌ఓ పి.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుంటూరు డీఆర్వోగా పెద్ది రోజా



గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారిగా పెద్ది రోజాను నియమిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆమె గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించి, కృష్ణా జిల్లాకు డీఆర్వోగా బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో సొంత జిల్లా నుంచి ఇక్కడకు మార్చారు. ఇక్కడ ఇప్పటి వరకు విధులు నిర్వహించిన చంద్రశేఖర రావును కృష్ణా జిల్లా డీఆర్వోగా పంపారు.

గుంటూరు ఏఎస్పీ (పరిపాలన)గా రమణమూర్తి

నగరంపాలెం: విజయవాడ అదనపు డీసీపీగా విధులు నిర్వహిస్తున్న జి.వి.రమణమూర్తి గుంటూరు జిల్లా ఏఎస్పీ (పరిపాలన)గా నియమితులయ్యారు. మంగళ, బుధవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఏఎస్పీ బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో గుంటూరు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజను ఏసీబీ ఏఎస్పీగా, గుంటూరు జిల్లా ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీగా, విజయవాడ అదనపు ఏఎస్పీ (ఎల్‌ఓ) సీహెచ్.లక్ష్మీపతిని పల్నాడు జిల్లా ఏఎస్పీ (క్రైం)గా నియమితులయ్యారు.

రామకోటేశ్వరరావు సేవలు అభినందనీయం



తెనాలి రూరల్: ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎస్కార్ట్ ఏఎస్ఐ వాకా రామకోటేశ్వరరావు బుధవారం పదవీ విరమణ చేశారు. 1984లో కారంపూడిలో ఉద్యోగంలో చేరిన ఆయన 40 ఏళ్ల పాటు సేవలు అందించారు. ఈ నేపథ్యంలో గంగానమ్మపేటలోని కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రామకోటేశ్వరరావును అభినందించి సత్కరించారు. 40 ఏళ్లుగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎటువంటి మచ్చ లేకుండా ప్రజలకు సేవలు అందిండంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, సిరికృష్ణ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులతో సత్ఫలితాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి
- ఏపీలో నూతన విద్యావిధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరిస్తున్న పానుగంటి చైతన్య

బాపట్ల అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య వెల్లడించారు. 2021 విద్యా సంవత్సరాన్ని నమూనాగా తీసుకుని పరిశీలిస్తే.. ఏడు పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తిలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఇది స్వయంగా ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించిన సత్యమన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు సోహిత్, రీజనల్ కోఆర్డినేటర్ మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం బాపట్లలోని కోన భవనంలో జగనన్న కాలేజ్ కెప్టెన్స్ పరిచయ కార్యక్రమం జరిగింది. బాపట్లలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలేజ్ కెప్టెన్స్ విద్యార్థులతో మమేకమై జగనన్న హయాంలో జరిగిన మేలుపై వారిలో అవగాహన కల్పించారు. జగనన్న హయాంలో మారిన విద్యా రంగం స్థితిగతులను సమగ్రంగా వివరించారు. విద్యారంగంపై నాడు–నేడు కార్యక్రమాన్ని బిగ్ స్క్రీన్ ద్వారా విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పానుగంటి చైతన్య మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎందుకు ముఖ్యమో చెప్పాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ప్రతి పేదవాడి భవిష్యత్ మారాలన్నా, పేదలు చదువుతున్న బడులు మరింత మెరుగుపడాలన్నా, ఇంగ్లీషు మీడియం చదువులు కొనసాగాలన్నా జగనన్న అధికారంలోకి వస్తేనే సాధ్యమని వివరించారు. మరో 10–15 ఏళ్ల తర్వాత ప్రపంచంతో పోటీ పడేలా చదువులు సాగించాలంటే అది కేవలం సీఎం జగన్ పాలనతో సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి, జిల్లా ఉపాధ్యక్షులు చోప్రా రాజశేఖర్, లక్ష్మీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్

మూడు రోజుల పాటు అలరించనున్న జాతీయ స్థాయి వేడుకలు



సన్నాహక కార్యక్రమాల్లో నిమగ్నమైన విద్యార్థులు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. మహోత్సవ్ కార్యక్రమాన్ని గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిలుగా చిందు యక్షజ్ఞానం ఆర్టిస్ట్ గడ్డం సామయ్య, ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ రఘు కుంచె హాజరవుతారని తెలిపారు. 3వ తేదీ ముగింపు కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ క్రికెట్ టీమ్ మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ హాజరవుతారని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 50వేల మంది విద్యార్థులు తరలి రానున్నారని ఆయన వెల్లడించారు. విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది మొట్టమొదటసారిగా క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించామని తెలిపారు.

సినీ తారల సందడి

మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహోత్సవ్‌లో సినీ తారలు సందడి చేయనున్నారు. 3న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ ఫిల్మ్ యాక్టర్ కిరణ్ అబ్బవరం, ఇండియన్ స్క్రీన్ రైటర్ బుర్రా సాయి మాధవ్ విచ్చేయనున్నారు. ఈ నెల 16న విడుదల కాబోతున్న ''సుందరం మాస్టర్'' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో హర్ష చెముడు, హీరోయిన్ దివ్య శ్రీపాద 2న సందడి చేయనున్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 75 ఈవెంట్లను నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయి. వీటితోపాటు కల్చరల్స్, లిటరరీ, ఫైన్ ఆర్ట్స్, ఫ్యాషన్, మ్యూజిక్, డ్యాన్స్, స్పాట్ లైట్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితర రంగాలను కలుపుకుని సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయి. పారా అథ్లెటిక్స్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

డ్వామా పీడీగా కుమార్

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా(పీడీ) ఏ. కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పీడీగా పనిచేస్తున్న వెంకట శివరామిరెడ్డిని ధర్మవరం ఆర్డీఓగా బదిలీ చేశారు.

రైలు నుంచి పడి మహారాష్ట్ర వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్లో నుంచి పడి మహారాష్ట్ర వ్యక్తి మృతి చెందిన ఘటన కొలనుకొండ బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలనుకొండ వంతెన కింద పట్టాల వెంబడి మృతదేహం పడి ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డులో మహారాష్ట్రలోని పుణే జిల్లా హవేలీ తాలూకా చిక్కలి గ్రామానికి చెందిన అసదుల్ హకీ లస్కర్(24) అని ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన డైరెక్టర్‌గా రోణంకి కూర్మనాథ్

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నూతన డైరెక్టర్‌గా రోణంకి కూర్మనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. నాగరాజు, సిబ్బంది కూర్మనాథ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

- ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి
- ప్రారంభమైన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలు
- పాల్గొన్న 15 రాష్ట్రాల క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బలరామ కృష్ణమూర్తి



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

చీరాల రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తద్వారా వ్యక్తిగత వికాసంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. 42వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ (అండర్–17, 19 బాల, బాలికలు) 2023–24 పోటీలను బుధవారం స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో నిర్వహించారు. నిర్వాహకులు డాక్టర్ ఇస్తర్ల బాబూరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడా ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చీరాలలో జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలను ప్రారంభించడం ఇదే ప్రథమమన్నారు. కొత్త ఆటను పరిచయం చేసిన డాక్టర్ బాబురావును ఎమ్మెల్యే అభినందించారు. 15 రాష్ట్రాలకు చెందిన బాల, బాలికలు పాల్గొనడం మంచి పరిణామమన్నారు. ఆటల వలన మేధస్సు పెరుగుతుందని, సమాజంలో మంచి చెడులపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది క్రీడాకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇస్తర్ల బాబూరావు మాట్లాడుతూ తాను జిల్లా బాధ్యునిగా ఉన్నప్పటి నుంచి నాలుగు సార్లు జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచినట్లు చెప్పారు. రెండు రోజులు పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికేట్లతో పాటు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అందించే సర్టిఫికేట్లతో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, షూటింగ్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కేజే జోసఫ్, జిల్లా అధ్యక్షుడు ఇస్తర్ల బాబురావు, జిల్లా కార్యదర్శి ఉల్లి సురేంద్ర, జిల్లా చీఫ్ ప్యాట్రన్ ఇస్తర్ల సుభాషిణి, జిల్లా చైర్మన్ ఎ. శంకర రెడ్డి, కౌన్సిలర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీ పోటీగా జరిగిన మ్యాచ్‌లు

మధ్యాహ్నం జరిగిన రెండు మ్యాచ్‌లు ఉత్సాహవంతమైన వాతావరణంలో పోటాపోటీగా జరిగాయి. ముందుగా ఆంధ్రా వర్సెస్ కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అండర్–17 బాలుర జట్ల క్రీడాకారులు తలపడగా ఆంధ్రా జట్టు క్రీడాకారులు మొదటి సెట్‌ను 15–10, రెండో సెట్‌ను 19–9 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో అండర్–19 బాలికల విభాగంలో తమిళనాడు వర్సెస్ మహారాష్ట్ర జట్ల క్రీడాకారులు తలపడ్డారు. ఈ మ్యాచ్‌లో మొదటి సెట్‌లో 15–8, రెండో సెట్‌లో 15–10 పాయింట్ల తేడాతో మహారాష్ట్ర జట్టు క్రీడాకారులు విజయం సాధించారు.

రేంజ్ పరిధిలో పలువురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.దేవప్రభాకర్, లాలాపేట పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.భాస్కర్‌ను పొన్నూరు టౌన్ పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న టి.వెంకటేశ్వర్లును తెనాలి రూరల్ సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.కె.సుభానిని తుళ్లూరు –1 పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.సురేష్‌ను మాచర్ల రూరల్ సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.రమేష్‌ను చిలకలూరిపేట టౌన్ పీఎస్‌కు, సీసీఎస్ నెల్లూరులో ఉన్న బి.రమేష్‌బాబును నరసరావుపేట ట్రాఫిక్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న బి.సుబ్బనాయుడు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీసెల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న సి.హెచ్.ఎల్.ఎన్.శ్రీనివాస్‌ను చుండూరు సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న సి.హెచ్. సింగయ్యను బాపట్ల డీటీసీ, డీటీఆర్‌బీకు, రేంజ్ వీఆర్‌లో ఉన్న సి.హెచ్.హజరయ్యను బాపట్ల దిశకు, రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.సుబ్బారావును త్రిపురాంతకం సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న దాసరి ప్రసాద్‌ను గిద్దలూరు రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు.

పట్టాభిపురం పోలీసు స్టేషన్ సీఐ పి.వీరేంద్రబాబును ఫిరంగిపురం పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.విజయచంద్రను పట్టాభిపురం పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న జె.రామకోటయ్యను ప్రకాశం జిల్లా కంబం సర్కిల్‌కు, కంబం సర్కిల్‌లో ఎం.రాజేష్‌కుమార్‌ను సత్తెనపల్లి రూరల్ పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న వై.శ్రీహరిను బాపట్ల రూరల్ పీఎస్‌కు బదిలీ చేశారు.

బజరంగ్ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ


- మునిపల్లెలో 662 మందికి నేత్ర, గుండె పరీక్షలు
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పొన్నూరు మండలం, మునిపల్లె గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ బుధవారం ఏర్పాటు చేసిన జగన్నామ సంక్షేమ సంగమం శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా వైద్య శిబిరానికి 662 మంది తరలివచ్చి, కంటి, గుండె పరీక్షలు చేయించుకున్నారు. వీటితో పాటు ఫిజియోథెరఫీ సేవల్ని వినియోగించుకున్నారు. వీరిలో 21 మందికి వైద్యులు యాంజియోగ్రామ్‌కు సూచించారు. ప్రత్యేక వాహనంలో శుక్రవారం ఉదయం వారిని విజయవాడ తీసుకెళ్లి వైద్య సేవలు అందించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం నుంచి స్ఫూర్తి పొంది సంవత్సర కాలంగా జగన్నామ సంక్షేమ కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. బజరంగ్ జగన్నామ నేత్ర జ్యోతి కార్యక్రమంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఏడు పని దినాల్లో కళ్లజోళ్ల పంపిణీ, మీ గుండె పదిలం కార్యక్రమంలో ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియో గ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమంలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్‌లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగుల్ని ప్రత్యేక వాహనాల ద్వారా శిబిరాలకు తీసుకువచ్చి, పరీక్షలు నిర్వహించి తిరిగి అదే వాహనాలలో పంపడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పలువురు తహసీల్దార్ల బదిలీ

గుంటూరు వెస్ట్: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో మూడేళ్లు నిండిన వారిని, సొంత జిల్లాలకు సంబంధించిన వారిని అధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాడికొండ తహసీల్దారు జి.వి.ఎస్.ఫణీంద్రబాబును బాపట్లకు, పొన్నూరు తహసీల్దారు శ్రీకాంత్ కేదార్‌నాథ్‌ను ప్రకాశంకు, తహసీలారు జి.సిద్దార్థను ప్రకాశం, గుంటూరు వెస్ట్ తహసీలారు కె.సాంబశివరావును తిరుపతి, పెదనందిపాడు తహసీల్దారు షేక్ మహమబూబ్ సుభాని బాపట్ల, దుగ్గిరాల తహసీల్దారు కె.మల్లేశ్వరిని బాపట్ల, కొల్లిపర తహసీల్దారు బి.నాంచారయ్యను తిరుపతి, ఫిరంగిపురం తహసీల్దారు బి.పద్మనాభుడును ప్రకాశం జిల్లాకు, తెనాలి తహసీల్దారు కె.రవిబాబును నెల్లూరుకు, వట్టిచెరుకూరు తహసీల్దారు కె.నరసయ్యను బాపట్లకు, మేడికొండూరు తహసీల్దారు కె.శ్రీనివాసశర్మను తిరుపతికి, పొన్నూరు తహసీల్దారు కె.కళ్యాణి తిరుపతికి, కాకుమాను తహసీల్దారు జె.ప్రసాదరావును ప్రకాశంకు, తాడేపల్లి తహసీల్దారు ఎం.నాగిరెడ్డిని ప్రకాశం జిల్లాకు, పిడుగురాళ్ల తహసీల్దారు కె.ఎస్.చక్రవర్తి ప్రకాశంకు, దాచేపల్లి తహసీల్దారు జి.కరుణకుమార్ తిరుపతికి, గురజాల తహసీల్దారు ఎం.డానియేల్‌ను ప్రకాశంకు, దుర్గి తహసీల్దారు జి.రమేష్‌కుమార్‌ను ప్రకాశంకు, మాచర్ల తహసీల్దారు షేక్ మొహమ్మద్ హుస్సేన్‌ను ప్రకాశంకు, మాచవరం తహసీల్దారు బి.వి.ఆర్.సి.హెచ్.ప్రసాద్ తిరుపతికి, రెంటచింతల తహసీల్దారు కె.పుల్లారావు తిరుపతికి, కారంపూడి తహసీల్దారు జి.శ్రీనివాస్‌ను తిరుపతికి, బెల్లంకొండ తహసీల్దారు దుర్గేశ్వరరావును నెల్లూరుకు, సత్తెనపల్లి తహసీల్దారు ఎస్.సురేష్‌ను ప్రకాశంకు, అమరావతి తహసీల్దారు జి.విజయశ్రీని నెల్లూరుకు, క్రోసూరు తహసీల్దారు ఎం.డి.జియావుల్ హక్ ప్రకాశంకు, పెదకూరపాడు తహసీల్దారు ఎం.క్షమారాణి నెల్లూరుకు, ముప్పాళ్ల తహసీల్దారు ఎం.భవానీ శంకర్ ప్రకాశంకు, రొంపిచర్ల తహసీల్దారు కె.సునీతను నెల్లూరుకు, ఈపూరు తహసీల్దారు కె.నాగేష్ నెల్లూరుకు, చిలకలూరిపేట తహసీల్దారు బి.సుజాత ప్రకాశంకు, నాదెండ్ల తహసీల్దారు ఎ.వి.రమణను నెల్లూరుకు, యడ్లపాడు తహసీల్దారు ఎం.నాగమల్లేశ్వరరావును నెల్లూరుకు, నూజెండ్ల తహసీల్దారు జె.మధుబాబు ప్రకాశంకు, వినుకొండ తహసీల్దారు బి.కిరణ్‌కుమార్ ప్రకాశంకు, అచ్చంపేట తహసీల్దారు పద్మాదేవి నెల్లూరుకు, బొల్లాపల్లి తహసీల్దారు ఎ.వి.సుధాకర్‌ను ప్రకాశంకు, సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయ ఏవో పి.మస్తాన్‌ను ప్రకాశంకు, పల్నాడు కలెక్టరేట్ ఏఓ ఆర్.యశోదను ప్రకాశంకు, బాపట్ల కలెక్టర్ కార్యాలయం ఎస్‌ఓ కె.సుజాతను ప్రకాశంకు, ఆత్మకూరు తహసీల్దారు పి.మెహర్‌కుమార్ బాపట్లకు, భట్టిప్రోలు తహసీల్దారు బి.వెంకటేశ్వరరావును బాపట్లకు, చిలకలూరిపేట తహసీల్దారు బి.వెంకటేశ్వర్లును నెల్లూరుకు, కొల్లూరు తహతహసీల్దారు ఎ.శ్రీనివాసరావును బాపట్లకు, రేపల్లె తహసీల్దారు డి.మల్లికార్జునరావుకు ప్రకాశంకు, చుండూరు తహసీల్దారు కె.రవికుమార్‌ను నెల్లూరుకు, వేమూరు తహసీల్దారు డి.నాగరాజారావుకు తిరుపతికి, కొరిశపాడు తహసీల్దారు బి.సుశీలను నెల్లూరుకు, మార్టూరు తహసీల్దారు పి.సురేష్‌బాబును నెల్లూరుకు, సత్తెనపల్లి సూపరింటెండెంట్ టి.రజిని పల్నాడుకు, ల్యాండ్స్ రికార్డుల సూపరింటెండెంట్ ఎస్.ఎల్.నారాయణరెడ్డిని బాపట్లకు, ప్రకాశం జిల్లా ల్యాండ్ సూపరింటెండెంట్ ఎస్.వెంకటేశ్వర్లును పల్నాడుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అవి తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

వినియోగదారుల సూచనల మేరకు ప్రణాళిక



గుంటూరు ఈస్ట్: విద్యుత్ వినియోగదారుల అభ్యంతరాలు, సూచనలు, పరిగణలోకి తీసుకొని ప్రణాళిక రూపొందించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో విశాఖపట్నం నుంచి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బుధవారం నిర్వహించిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ వీడియో సమావేశంలో జిల్లా ఎస్ఈ మురళీకృష్ణ యాదవ్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీధర్, డీఈ టి.శ్రీనివాసరెడ్డి, ఎస్ఏఓ రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. వినియోగదారుల తరపున మినీ హైడెల్ పవర్ యూనిట్ అసోసియేషన్ నిర్వాహకులు కోటి రావు ఒక్కరే హాజరయ్యారు. జిల్లా ఎస్ఈ మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ 2024 – 2029 సంవత్సరాలకు విద్యుత్ అవసరాలపై ప్రణాళికను పరిశ్రమలు, చాంబర్ ఆఫ్ కామర్స్, ఇతర పరిశ్రమల నిర్వాహకులు, విద్యుత్ వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేసినట్లు తెలిపారు. డిస్కం వార్షిక ఆదాయం, అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు చెప్పారు. వీడియో సమావేశంలో రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీ బాధిత రైతుల వివరాలు అందించాలి

కొరిటెపాడు(గుంటూరు): దుగ్గిరాలలో ఈ నెల 19వ తేదీన శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం, అందుల్లో నిల్వ ఉంచిన పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఆహుతిపై విచారణ జరుగుతోందని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ నందు పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకున్న రైతులు తమ పంట వివరాలను వారం రోజుల లోపు దుగ్గిరాల మార్కెట్ కమిటీ, కార్యదర్శికి రిజిష్టరు పోస్టు ద్వారా కానీ, వ్యక్తిగతంగా కానీ సమర్పించాలని సూచించారు. సంబంధిత కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం జారీ చేసిన బాండు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ లోన్, బీమా(నకలు కాపీ) తదితర వివరాలతో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.